# దావతు

ఎండుగడ్డికి నిప్పంటుకున్నట్టు - అవార్త నలుగురి నాల్కలమీదాడుతూ గూడెములోని ఇంటింటికీ పాకింది.

పొద్దు కరకర పొడవకముందే గూడులోంచి పందులను ఊళ్ళోకి వదిలేసి అరుగు అంచున కూచున్న మైసయ్య మెదడు పొరల్లో గూడా అదేసంగతి అల్లరి పెడుతోంది. ఆపద ముంచుకొచ్చి అతలాకుతలం చేస్తున్నట్టు - మనసులో మనసులేదు. గూడులోని పందుల్లా లోలోపల ఆవేశం, రోషం, అశక్తత అదే పనిగా తిరుగాడుతున్నాయి.

"బాలిపోరి పెద్దమనిషైందని తెల్వదా? దానికి లగ్గం జెయ్యాలని నాలుగైదేండ్లనుండి నెత్తీనోరు గొట్టుకుంట మొత్తుకుంటున్నా. నీకేమో చెవ్వు మీద పేను పారినట్టుగూడా లెదాయె. నేనేమో ఆడముండనైతి. కోరవయసులన్న పోరి కొంగుకప్పకోని ఇంట్ల కూకుండే రోజులా ఇవి? గట్లా బెల్లం గొట్టిన రాయోలె కూసుంటే ఏం లాభం? గిట్లైతే ఎట్లానయ్యా?" నిప్పుమీది ఉప్పులా చిటపటలాడ్తున్న భార్య దెప్పిపొడుపులు కుతుకుతలాడిస్తున్నాయి.

అప్పటికీ తానన్నాడు-

"అరె నీయవ్వ! ఆడపోరగాండ్లకు పద్దెనిమిదేండ్లలోపల పెండ్లిజేస్తే గవుర్మెంటోళ్ళు తల్లిదండ్రుల్ని పట్టుకపోయి జేల్ల పారేస్తరట. అది కానూనటా. మరి నువ్వూనేను జేల్ల కూకుంటే బాగుంటదా? నువ్వే చెప్పు..."

కానూన్ అంటే చట్టమని దాన్ని గౌరవించాలని ఊరందరికీ తెలుసు కాని భార్య తక్కువ తిన్నదా?

"కానూన్లకేం తక్కువ? లచ్చతొంబయుంటై. వంగెటోనికెర్క గూనివాటం. మరిప్పుడు చూడు ఏమైందో. మన ఇజ్జత్ ఇల్లెంతకుంటల కలిసిపోతుంది. గదా?"

"గదంతా చాట భారతమెందుకే. అయింది గట్ల. ఇప్పుడేం చెయ్యాల్నో చెప్పు." భార్యను కైమాకొట్టాలన్నంత కోపాన్ని దిగమింగడం కష్టంగావుంది.

భార్య చూపులు ఇంటిచూరుమీదున్నె కొద్ది సేపట్లానే చూస్తుండి పోయింది. ఆ తర్వాత నిరాశగా నిట్టూర్చింది. కొంగు సవరించుకొని

"ఇంగ చేసేదేముంది? ఆ నారిగాని అయ్యముంగట పుల్లేసిరాపో" సలహా యిచ్చింది.

మైసయ్య గుండె ఝల్లుమంది.

"అంటే పంచాయితీ పెడ్తామా?" నోరు బార్లా తెరుచుకుంది. కూచున్న అరుగు ముళ్ళకంపలాగన్పించింది.

"మరి లేకపోతే ముద్దు పెట్టుకుంటవా! గా నారిగాని లెక్కెంత, పత్రమెంత? వాడు మన బాలిపోరిని గట్లజేస్తే ఊకుంటమా? నలుగురిట్లకు గుంజుకొచ్చి కులపోల్లముందు ముక్కున్యాలకు రాయించాలె. వాని ఇజ్జత్‌కు ఇంగులం బెట్టాలెగదా! లేకపోతే బాలిపోరి బతుకు బజార్ల వడదా?" గట్టిగా ఝాడించి పారేసింది.

భార్యమాటల్లో నిజముంది. కాని .... ఇప్పుడేట్లా? అటూ ఇటూ దృష్టి మళ్ళింది. "అవునుగాని బాలిపోరి ఏదీ?" ఆవేశం చల్లారి ఆలోచన మొదలైంది. అరుగు మళ్ళీ అరుగులాగన్పించింది.

"ఆదింకా ఇంట్లనే కూకుంటదా?" భార్య చేతులు, మూతులు తిప్పుతూ నుదుటిమీదున్న ముంగురులు సవరించుకుంది. "పంది గొడ్దెలేరెతందుకు వోయిందో లేక ఆ నారిగాని తోని నవ్వులాడెతందుకు వోయిందో. నారాయణకు సిగ్గులేక పోతే వాని అయ్య వెంకటేశుగ్గూడా లేదా? ఫో... ముందుగాల పోయి పుల్లేసి రాపో....." తరిమినంత పంజేసింది.

నిజమే. నా బిడ్డ బాలవ్వమీద ఇయ్యాల్ల నారాయణ చెయ్యేసిండు. ఇప్పుడు గమ్మునూకుంటె రేపు ఇంకొకడేస్తడు. ఎల్లుండి మల్లొకడేస్తడు. గిట్లనే అయితే దాని బదుకు కుక్కలు చింపిన ఇస్తరైపోతది. వామ్మో! ఇప్పుడే పుల్లేసి వస్తే పీడవోతది. మెత్తటోల్లను జూస్తే అందరికీ మొత్త బుద్దెతదటా... తనను తాను సముదాయించుకున్నాడు. మైసయ్య.

★ ★ ★ ★

పుల్లవెయ్యడమంటే - నువు నా కన్యాయం జేసినవు పంచాయితీ పిలువు. కులపెద్దలముందు మన తగాదా తెలుపుకుందాం. లేకపోతే నేనే పంచాయితీ పెట్టి నిన్ను కులంనుంచి తీయించేస్తానన్నట్టేగదా! మైసడు నా ముంగట కట్టెపుల్ల ఇరిచి పారేసిపోయిండు. నేనే మా కులపెద్దనూ, కులస్తులను పిలిచి పంచాయితీ పెట్టాలెగదా! అరె నీయవ్వ... గీ ఆచారం ఎవడు పెట్టిండో ఏమోగాని ఇప్పుడు నా పానం మీదికొచ్చింది. పిలవకపోతే కులంనుంచి తీసేస్తరేమో!

కులంనుంచి తీసేసిన మనిషి చెట్టునుంచి రాలిని ఎండుటాకోలె ఒంటిగాడై కొట్టుకపోవాలె. పెండ్లిల్లకు పబ్బాలకు ఎవ్వరూ పిలువరు. దావతులకు రానియ్యరు. భొట్టు బంద్ జేస్తరు. గూడెపోల్లంతా. చీమలెక్కనో, దోమలెక్కనో, గంజిల ఈగ లెక్కనో చూస్తరు. అరె నీయవ్వ! గీ నారిగానికేం పోగాల మొచ్చిందో. నా కదుపు చెడబుట్టిండు బాడ్కావ్. ఉన్నజాగలుండక గాపోరి తెరువెందుకు వోయిండో ఏమో!... అనుకోకుండా వచ్చిన సంకటాన్ని తట్టుకోలేక వెంకటేశు సతమతమై పోతున్నాడు.

"వెంకటేశూ! నీ కొడుకు నారాయణ నా బిడ్డ బాలవ్వమీద చెయ్యే సిండు. వానికి గవుర్మెంటు నౌకరుందని గర్రనేమో! ఇంగోపుల్ల..." అంటూ మైసయ్య విరిచి తనముందుకు విసిరేసిపోయిన పుల్లముక్కలను అటూ ఇటూ తిప్పుతూ అల్లాడిపోతున్నాడు. అదే సంగతి భార్యతో చెప్పేసాడు.

బంతిపూవులా నవనవలాడ్తున్న భార్య మొహం రంగులుమారి మసిగుడ్డలాగై పోయింది. కొంగు బొడ్లో దోపుకుంటూ గంయ్ మని లేచింది.

"అరె! గంజాయిదాగినట్టు ఇంకా గట్ట కూకున్న వేందయ్యా? మనోడు మొగపోరడు. ఆడపోరిని కన్నోనికే గంత రోషముంటే మనకెంత వుండాలే? కులపెద్దకు చెప్పిరాపో! పంచాయితీ నడువనీ! గా మైసయ్యేంత, గా బాలిపోరెంత?" మెటికలు విరిచి

సవాలుచేసింది, అంతటితో ఆగకుండా, "వాళ్ళ ఉరుకులాట వరదగొట్టుకుపోను. వాళ్ళ ఇంట్ల కాకుల గద్దలాడ...." అంటూ కాళ్ళూ చేతులూ తిప్పుతూ తిల్లపురాణం విప్పింది. సిగమొచ్చినట్లు చిందులేసింది.

వెంకటేశు వెన్నుపూసలో అలజడి పెరిగింది.

"నీ యవ్వ! ఇంగ పంచాయితీ తప్పదా? కడుపుల చల్ల కదలకుండా ఉందామంటె నీ కొడుకు గిదో చిచ్చువెట్టె..." పరువు ప్రతిష్ఠలే ప్రాణంగా బతుకుతున్న ప్రాణం, అవమాన భారంతో అడుగు ముందుకు పడడంలేదు. ఖాళీగా పడున్న పందుల గూడును కన్నార్పకుండా చూస్తున్నాడు.

పంచాయితీ పెట్టి మైసయ్య, వాని కూతురుల రంగు బయటపెట్టాలె. నా కొడుకు మంచోడని నలుగురికి తెలియాలె. ఎలాగైనా సరే భర్తనందుకు ఒప్పించాలని భార్య చల్లబడింది.

"ఆగో గదే వద్దన్నా! గట్లనుకుంటే ఎట్లానయ్యా.. రోట్లె తలకాయవెట్టి రోకలిపోటుకు భయపడితే తప్పుతదా! కులపోల్లముందు వాళ్ళ ఇజ్జత్, మానం పంచనామై పోవాలె. పంచాయితి పెట్టించక పోతే మనమే తప్పుల వడ్తము. నలుగురు మన మొఖాలమీద ఊంచి తప్పుజేస్తరు. దండుగ కట్టిస్తరు..." సముదాయింపు సాగింది.

పుర్రెల పురుగులు పాకినట్టయింది వెంకటేశుకు. పిచ్చెక్కినట్టు... ఎట్లానో ఉంది.

"పోరడు వైసులున్నడు. నౌకరి దొరకంగనే లగ్గం జేద్దామంటె నువ్వూ, వాడు బదులుకొని ఒప్పుకొకొ పోతిరి. నా మాటంటే నయాపైసంత విలువ లేకపాయె. వానికప్పుడే లగ్గంజేస్తె ఇప్పటికి ఇద్దరుపిల్లల తండ్రి అయేటోడు. నీ యవ్వన్...." బూతు పంచాంగం.

"రామ రామా!" తలకొట్టుకుంది భార్య. "అరె... పొద్దుగాల్ల పొద్దుగాల్ల పాశికల్లు దాగినవా! గట్ల లొట్టిమీది కాకిలెక్క లొల్లివెడ్తున్న వెందుకూ? మొగపోర గాండ్లకు ఇరవయ్యొక్కేడు వైసు దాటేదాకా లగ్గం జెయ్యద్దనీ, చేస్తే అవ్వ-అయ్యల్ని పోలీసులు పట్టుకపొయ్యి బొక్కలిరగ్గొడ్తరని గప్పుడెప్పుడో నువ్వే జెప్తివిగదా! కానూన్ అంటే మాటలా మజాకా?"

పచ్చివెలక్కాయ గొంతులో చిక్కుక్కున్నట్టు వెంకటేశుకు మాటపెగ్గల్లేదు. కొద్ది క్షణాలు మౌనంగా గడిచినై. ఆ తర్వాత పుల్ల గుర్తుకొచ్చి పళ్ళు పటపటలాడినై. మైసయ్య ముందుంటే గొంతు పిసికెయ్యాలన్పిస్తుంది. కాని ఏం లాభం? ఎదురుగా ఉంది భార్య.

"అవునే, ఉన్నమాటనే చెప్పిన, నేనేమన్నా అబద్ధం జెప్పిన్నా?"

"అందుకే.. అప్పుడు వానికి లగ్గమొద్దన్నా ఇప్పుడు చెయ్యమంటున్న. మంచి పిల్లను చూడు." గుడ్లరిమింది. ఆ తర్వాత బతిమిలాటకు దిగుంది.

"ఇక్కడిప్పుడు లోల్లీ లొకారమెందుగ్గానీ... ముందుగాల నువు కులపెద్దకు చెప్పుపోరా మొగడా!" ఎంత వద్దనుకున్నా ఉక్రోశం ఉబికొస్తుంది.

"ఇప్పుడు నువు పోకపోతే అప్పటికి మైసయ్యనే పోతడు. చూడమల్లా. మన ఇజ్జత్ ఏట్లె కలుస్తది. గట్లైతే మన నారిగాని కెవ్వడూ పిల్లనియ్యడు. నువ్వూ, నీ కొడుకు నలుగురిముంగట ముక్కు న్యాలకు రాయాలె. కులం నుంచి భైటకు రావాలె...ఆ....." కనుగుడ్లు దిప్పుతూ కఠినంగా హెచ్చరించింది.

వెంకటేశు నిలువెల్లా వణికిపోయాడు. బుర్రలో ఏడేడులోకాలు గిర్రుగిర్రుమన్నై. రెక్కలు కట్టుకుని వెళ్ళి కులపెద్దముందు వాలాడు.

★ ★ ★ ★

ఎరుకల గూడెము. అదొక లోకము.

తరతరాల పంచాయితీలను ప్రత్యక్షముగా చూసిన రావిచెట్లు గూడెము మధ్యనుంది. కొమ్మలు రెమ్మలుగా విస్తరించి మారుతున్న నాగరకత పోకడలను జాగ్రత్తగా గమనిస్తోంది. ఎందరికో నీడనిస్తోంది. పెళ్ళిళ్ళు పెటాకులు, మనసుల మార్పులు - మారు మనువులు, గుంజులాటలు - గుంజాటనలు.. తన నీడన ఎన్నో సంఘటనలు జరుగుతున్నా కిక్కురుమనకుండా ఓర్పుగా నేర్పుగా సహిస్తోంది. చెట్టు మొదట్లో కాండము చుట్టూ పరుచుకున్న మూడుడుగుల ఎత్తు గద్దెమీద కులపెద్ద కొలువుదీరాడు. కుడిచేతి వేళ్ళు పొడుగాటి మీసాలను తడుముతూంటే, చూపులు పక్కన కూచున్న పెద్దమనుషులను తడుతున్నాయి. బూడిదరంగు మీసాలకింద నల్లని పెదాలు. నల్లనిపెదాల మీద తెల్లని చిరునవ్వు.. గద్దెముందు కూచున్న కులస్తులను సైగలతో పలకరింపులు.

పోకిరివెధన ప్రేలాపనలా ఎండ ధగధగా మెరుస్తోంది. ఆ ఎండలో బలం లేదని అందరికీ తెలుసు. అయినా చెట్టుకింద తీరుబడిగా కూచ్చున్న కులస్తులు ఒంటికి ఎండసోకకుండా జాగ్రత్త పడుతున్నారు. ఊరు దూరమ వుతుంది. - కాటికి దగ్గరవుతుంది. ప్రాణం... అనుకుంటున్న వృద్ధుల నోట్లో చుట్టలు. ప్రౌఢుల పెదాలమధ్య బీడీలు, యువకుల చేతివేళ్ళ మధ్య సిగరెట్లు మిణుకు మిణుకుమంటున్నాయి. చెట్టునీడన ఓ పక్క చెట్టంత మనుషులు మైసయ్య, వెంకటేశులు - ఆరోజే బడిలో చేరిన బాలల్లా చేతులు కట్టుకు నుంచున్నారు.

నడివయస్కుల లోకాభిరామాయణం, జోరువయసువారి జోకాభి రామాయణంతో పోటీ పడుతోంది. అందరి మనసు ఆరోజు రాత్రి జరగబోయే కల్లు దావతుమీదుంది. వడ్డించబోయే పందిపలావు నోట్లో నీరు ఊరిస్తోంది.

కొద్దిరోజుల క్రితం చిన్న తగాదా ఒకటి పంచాయితీ కొచ్చింది. పంతం, పట్టుదలలతో పెరిగి పెద్దదై మూణ్రోజుల పంచాయితీ నడిచింది. బలిసిన పంది రోజుకొకటి తెగింది. కల్లుదాగుతూ, మసాల దట్టించి వేయించిన పందిమాంసం ముక్కలు నంజుకుంటూంటే స్వర్గం దిగొచ్చిందన్నారంతా. ఖర్చు భరించలేక తగాదాదార్లు లబోదిబోమన్నారు. తగాదా ఏమోకాని ఆ దావతుకోసం చేసిన అప్పుమీద వడ్డీ పెరిగిపోతుంది.

లోకాభి, జోకాభి రామాయణాలతో బోరెత్తిన ఓ వృద్ధునిగొంతు "గీ ముచ్చట్లకేంది గానీ పంచాయితి షురూ జెయ్యండ్రిరా" అసహనంగా అరిచింది. చెట్టునీడన అనుభవాల పరువుమీద పవళించిన మరో వయ్యోవృద్ధుడు బలపరిచాడు.

గద్దెమీది పెద్దమనుషుల మొహాలు గాంభీర్యాన్ని పులుముకున్నాయి. కళ్ళు వింతగా కదుల్తూ సైగలు చేసుకున్నాయి. కులపెద్ద కాస్సేపు తటపటాయించి గద్దె అంచుకొచ్చాడు. కాళ్ళు కిందికి జారవిడిచి సర్దుక్కూర్చున్నాడు.

"వారీ...మైసయ్యా! వెంకటేశుతో నీకు పంచాయితీ ఉందని పుల్లేసినవా?" రీవిగా వచ్చేసింది ప్రశ్న.

"ఏసిన."

"అదేందో మాకందరికీ ఇవరంగా చెప్పుబిడ్డా!" రుమాలు సర్దుకుని చుట్టవెలిగించాడు.

"ఏంలేదే!" కరుకుబీడి మౌసయ్య కాలుకిందనలిగింది. తానుగూడా రుమాలు సవరించుకున్నాడు. "నేనేమో ఆడపోరి తండ్రినైతి. దానికో మంచి పిల్లగాణ్ణి జూచి లగ్గం జెయ్యాలని తిరుగుతున్న, తిప్పలు వడుతున్న. గింతలనే గీ వెంకటేశు కొడుకు నారిగాని కండ్లకు కాపురమొచ్చె. గదేదో అటెండర్ నౌకరి జేత్తున్నడుగదా. గర్ర పెరిగిందేమో వాని పాపపుకండ్లు నా బిడ్డ బాలవ్వమీద వడ్డె..." విషయమంతా వివరించి చివరి పలుకులకొచ్చాడు. "గా నారిగాడు ఇయ్యాల్ల నా బిడ్డను గట్లజేసిండు. రేపు ఇంకొకల బిడ్డను జేస్తడు. ఇంగ వాని ఇష్టారాజ్యమైతది. మన ఎరుకలగూడెముల వాడో మొనగాడైండా? గా సంగతేందో అడుగుండ్రి. వైసులన్న కొడుక్కు లగ్గంజెయ్యక మైసమ్మ కిడిచిపెట్టిన దున్నపోతోలె వాణ్ణి ఊరుమీదికిడిచిపెట్టిన ఈ వెంకటేశు సంగతేంది? బరిదెగించిన ఆ నారిగాని ముక్కుకు ముగదాడు ఏస్తరా లేదా? చెప్పుండ్రి."

కులస్తుల్లో కలకలం బయలుదేరింది.

"ఓర్నియవ్వ! మొగపోరడైతే.. ఊరపందిలెక్క ఊరుకుంట ఊరుమీద వడ్తడా?"

"మాయ మర్మం దెలవని గా పోరికి మంత్రమేసి గట్లజేస్తడా?"

"మరుగు మందేమన్నా పెట్టిండో ఏమో!"

"గదే వాని అక్కకో చెల్లెకో అయితే ఊకుంటడా?"

వ్యాఖ్యానాలు వెల్లువెత్తినై. కడుపులో చల్ల కదలకుండా సంభాషణలు సాగిపోతున్నె

"మీరు జెర ఆగుండ్రహ!" కులపెద్దకు చిర్రెత్తింది. లేచి కాండ్రించి ఉమ్మేసి కూచున్నాడు. "అంత మీరు మాట్లాడ్తే ఇంగ మేమెందుకూ?" బెదిరించాడు. గద్దెమీది పెద్దమనుషులు వంత పాడారు.

వ్యాఖ్యానాల పరంపర ఆగిపోయింది. టేకువనంలో వెలసిన వానలా గైంది పరిస్థితి. మాటలుమాని మొహాలు చూసుకుంటున్నారు కులస్తులు.

"ఇంగ నువు చెప్పుకోరా వెంకటేశూ!" ధోతి సవరించుకుని కుదురుగ్గా కూచున్నాడు కులపెద్ద. మొహమ్మీద గర్వం ఛాయలు గంతులేస్తున్నె.

వెంకటేశుకు నెత్తి గోక్కోవడం వినా మరేమీ తోచలేదు. 'దీంతల్లి ముండవొయ్య. నాకు పంచాయితి అంటే పానం బోతదే.' చేతులు పిసుక్కో వాలన్పించింది.

"ఓర్నీయక్కా! గట్ల భయపడ్తే ఎల్లరా వెంకటీ?" ఓ పెద్దమనిషి కంఠం ఖంగు మంది. "మనమంతా కులకట్టుల ఉన్నంగదా. ఇక్కడ పరాయిలెవ్వరూ లేరు. పుల్లేసి పోయినంక పులి అసొంటోడైనా, పిల్లి అసొంటోడైనా ఇక్కడికి రావాలె. సంగతంతా పూసగుచ్చినట్టు చెప్పుకోవాలె. ఇది మన ఆచారంగదా! చెప్పుకోకపోతే వువ్వే తప్పుల వద్దవు. నీకేం భయంలేదు. చెప్పెయ్."

వెంకటేశు గుండెల్లో గుండ్రంగా తిరుగుతున్న గుండ్రాయి ఠక్కున ఆగిపోయింది. కొంచెం ధైర్యమొచ్చింది.

"మన కులపోల్లందరోలె నీకూ పందులున్నై. నీకూ కుల కశ్శి ఉంది. ఇంక నీ కొడుక్కు సర్కారు నౌకరుంది. వెనకా ముందాడక ధైర్యంగా చెప్పు. మేమంతా లేమూ?" మరో పెద్దమనిషి కనురెప్పలు పక్షిరెక్కల్లా పైకిలేచినై. తన సహజ ధోరణిలో సముదాయించాడు.

వెంకటేశు నరాల్లో ఉత్సాహం ఉబికొచ్చింది.

"సరే... ఇంగ చెర్ల దుంకినంక చేతులు. కదలకుంటే కలుస్తదా? అసలేమైందంటే... అంటే..... అంటే...." అరిగిపోయిన రికార్డులా గొంతు ఆగిపోయింది. కాస్సేపట్లో ధైర్యం ప్రోది అయింది. "నీయవ్వ! గదంతా నాకు దెల్వకుండ జరిగిపోయిందే." కులపెద్ద కళ్ళలోకి చూడగానే నీరుగారి పోయాడు. అయోమయం.

"గదేబిడ్డా! వెంకటేశూ! బేజారెందుకూ? నీకు దెల్వకుంట ఏం జరిగిందో వరంగ జెప్పు...." కులపెద్ద కులాసాగా నవ్వేశాడు.

అయోమయం పటాపంచలైంది.

"సరే ఇనుండ్రి. నా కొడుకు నారాయణకు నౌకరి దొరికినప్పట్నుంచి గీ మైసయ్య మాయదారి కండ్లు వానిమీద్ద వడ్డై. తనబిడ్డ బాలవ్వను వానికి అంటగట్టాలెనని నా ఇంటిచుట్టూ తిరిగిండు. సరే....మంచిదన్నాను. ఇరవై పందులు, ఐదు తులాల బంగారం, ఇరవై తులాల వెండి కట్నమిచ్చ లగ్గం జెయ్యిమన్న. గాయింత దానికే బెదిరిపోయిండు. అద్దతులం బంగారం, ఐదుపందులిస్తనన్నడు. నేను నా కవసరం లేదన్నా వేరే ఊరోళ్లైతే పదితులాల బంగారం, గూటినిండా పందులిస్తమన్నరు. ఏదో..... మనూరోడు, మంచోడు గదాని చెప్పిచూసిన. నేనెంతజెప్పినా వినలేదు. ఇగ గిట్లైతే కుదరదని బాలిపోరిని నా కొడుకుమీదికి ఎగవెట్టిండు..." విషయంతోపాటు కసికూడా కక్కేస్తున్నాడు. "వైసొచ్చిన పోరికి ఇది కాకపోతే ఇంకో సంబంధం చూడాలెగాని... ఊర్లె పోరడైతే మాత్రం మానారిగానికేం తక్కువ? బంగారం మసొంటి పోరడు.... పుణ్యానికే అల్లుడై పోతడా? జెర మీరే ఆలోచించుండ్రి. ఇదంతా. మోసం. గా బాలిపోరి మావోని మీద మచ్చు జల్లి మాయజే సింది. బస్.... గంతే! నారాయణ సమర్ధించుకున్నాడు."

కులస్తుల్లో మళ్ళీ కలకలం బయలుదేరింది. గుసగుసలు, రుసరుసలు ఊపందుకుంటున్నాయి. ఒళ్ళంతా కత్తులతో పొడిచినట్టుంది మైసయ్యకి. మనసంతా కుతుకుతలాడ్తోంది.

"నీయవ్వ! గానాటి సంగతి గిప్పుడు జెప్తున్నవా వెంకటేశూ! మొగపిల్ల గాని తండ్రిని గదాని నోటికొచ్చినంత కట్నమడిగితివి. నాతోని కాదన్న. బస్.... ఆసంగతి ఆనాడే ఐపాయె. నా పందుల్ని నా ఇల్లును చెల్లువెట్టాలని ఆవుడియా జేసి నీ కొడుకును గా పోరిమీదికి ఇడిచి పెట్టినవ్‌గదా! ఇది ధరమమేనా?" కులస్తులవేపు చూస్తుంటే రోషం పొడుచుకొస్తుంది. "మీకు ఆడపిల్లలు లేరా? ఆడపిల్లలున్నోడు అడివిల పడి కొట్టుకు చావాల్నా?"

కలకలం బలం పుంజకుంది. తలా ఓమాట...

"సిన్మాలు జూసి పోరగాండ్లు అన్యాలమైపోతున్నరు."

"పేమా దోమా అని పిచ్చిపిచ్చి ఏషాలు ఏస్తున్నరు."

"మొగపోరగాండ్లనైతే పట్టవశమైతలేదు."

"ఆడపోరీలు తక్కువ ఎగవడ్డరా?"

"గీ టీవీలు గూడా వీళ్ళను సర్వనాశనం జేస్తున్నె. అవ్వ! కోరవైసులున్న పోరీలకు పెయ్యిమీద కోకలుండవు. ఒంటికి అతుక్కుపోయే లాగులు దొడిగి ఎగవడుతుంటే మొగపోరగాండ్లకు పిచ్చిలెవ్వదా?" వేదికనుద్దేశించి ఒకాయన దులిపేస్తున్నాడు. "పోరీలు పోరగాండ్లు కలిసి డాన్స్‌చేసుకుంట ఒకలమీద ఒకలు పడవట్టిరి. ముద్దులు పెట్టుకోట్టిరి. థూ.... నీయవ్వ! ఇంగ దోరవైసుల ఉరకులాడుతున్న పోరలు ఆగుమంటే ఆగుతరా? చెప్పినట్టు ఇంటరా?"

యువకుల్లో ఆవేశం అంగలేసింది.

"అరె నీయవ్వ! ఉరుమురిమి మంగలంమ్మీద వడ్డట్టు మా మీద ఏడుస్తరెందుకే? సిన్మాలల్ల, టీవీలల్ల అన్యాయం జెయ్యుమని చెప్తుండ్రా?"

"గందుకే మీ నెత్తులకు గవే రుమాండ్లు, నడుములకు గవే బుడ్డగోచీలు. నీ యవ్వ! దునియా అంతా మారినా మనం మారొద్దా? జెరంత నాగరికంగా ఉండొద్దా?"

"మనదేశం చాలా ముందుకు వోతుంది. గవుర్మెంటోళ్ళు మనం ముందుకు రావాలని ఎన్నో స్కీములు వెట్టిండ్రు. ఎంతో సాయం జేస్తున్నరు. మనమేమో వాటినందుకో లేక ఇట్ల ఎనకవడున్నం. తాటిచెట్టు ఎక్కెటోని ముడ్డి ఎంతదాక లాగవడ్తరు? సొంత తెలివిగూడ కొంత ఉండాలెగదా కదా పెద్ద మనిషీ!" కులపెద్దను కవ్వించాడో యువకుడు రంగులు మారే రాజకీయపార్టీలో హంగులు మార్చుకోవడంలో నేర్పరతడు. ఆ గూడెములో ప్రత్యేకమైన గుర్తింపు ఉన్నవాడు.

తేలుకుట్టిన దొంగలా కలపెద్ద అవస్త పడుతున్నాడు. తాబేలులా ముడుచుక్కూ చున్నాడు. తలనేలకు వాలింది. అరెరే... ఇట్ల కూచుంటే ఎట్ల? ఇదంతా పోరగాండ్ల ఆటైపోతది...' కాస్సేపు ఆలోచించాడు. గట్టిగా నిట్టూర్చి గబ్బుక్కున అందుకున్నాడు.

"అరేయ్! ఓ చెంపగొడ్తే పాలు ఇంకో చెంపగొడ్తే నెత్తురు. మీరింకా చిన్న పోరగాండ్లు. దునియా సంగతి మీకేం దెల్సురా? అనుబగించి అనుబగించి మా మీసాలు తెల్లవడి పోయినై. నెత్తి ఎంటికలు రాలిపోతున్నె" పరువు నిలబెట్టుకునే ప్రయత్నానికి

బింకం తోడైంది. బలవంతంగా నవ్వుతూంటే పక్కనున్న పెద్దమనిషివైపు చూపులు మళ్ళినై. అప్పటిదాకా ఆశ్చర్యంలో మునిగి బొమ్మల్లా కూచున్న పెద్దమనుషుల్లో కదలిక ప్రారంభమైంది. కులపెద్దకు మద్దతూ లభించింది. యువకుల దెబ్బలాట పూర్తికాలేదింకా.

"నీ యవ్వ పనికిరాని ముచ్చట్లు చాలుగాని ఇంగ పంచాయితీ సంగతి చూడుండ్రి బిడ్డా!" అసలు విషయం గుర్తుచేశాడో వృద్ధుడు.

వామ్మో! గట్లయితే పంచాతీ ఈరోజే ఐపోతది. ఒక్క దావతుతోనే ఖతమైపోతది... గుంపులో గుసగుసలు.

"మరి ముద్దాయిలు లేరుగదా! పంచాయితీ ఎట్ల చేస్తరు? తీర్మానం ఎట్లజేస్తరు?" ఓ కులస్తుని సవాల్.

అప్పుడు గుర్తుకొచ్చింది పెద్దలకు... బాలవ్వ, నారాయణలక్కడలేరని. బాలవ్వ నారాయణలు పంచాయితీ ముందు హాజరు కావాలని కులపెద్ద ఆదేశముంది. కాని... వాళ్ళిద్దరూ రాలేదు. కులపెద్దకేం చెయ్యాలో తోచలేదు. ఆ సంగతి అందరికీ తెలిస్తే తన బలహీనత బయటపడి పరువు పచ్చిపులుసైపోతుంది. ముద్దాయిలు రాలేదని పంచాయితీ ప్రారంభించకపోతే ఆ రాత్రికి దావతు ఉండదు దాంతో కులస్తుల నిరసన నెదుర్కోవాలి. పంచాయితి కొంచెం నడిచి ఆగినా - దావతు ఏర్పాటు చెయ్యాల్సిన బాధ్యత కక్షదార్లమీదుంటుంది. కానీ.. ఇప్పుడా సవల్‌కు ఏదో ఒక జవాబివ్వాలిగదా!

"ముద్దాయిలు లేరన్న సంగతి మనకు దెలుసు. గిప్పుడే వాళ్ళని పిలిచి నిలవెడ్తే గీ వైసుపోరల లొల్లి వశంగాదు. మనల్ని గడ్లెగలిపి దొడ్డె దోల్తరు.." పక్కనున్న పెద్దమనిషి చెవిలో ఊదాడు. పెద్ద బుర్రలో బల్బు వెలిగింది. మొహం దేదీప్యమానమైంది.

"అరె! గా పోరగాండ్లదేమున్నది? ఎప్పుడు వద్దే అప్పుడు గుంజుకొచ్చి మనముందర నిలవెట్టొచ్చు. ముందు వాళ్ళ తల్లిదండ్రుల బయానలు వినాలెగదా!" తేల్చిపారేశాడు. 'అవునవును' అంటూ మిగతా పెద్దమనుషుల తలకాయలు తాటికాయల్లా ఊగినై.

"సరే... ఇప్పుడు మీ ఆలోచనలు చెప్పుండ్రి." మీసం మెలేస్తూ కులస్తుల నాదేశించాడు కులపెద్ద.

కిందకూచున్న కులస్తులంతా గుంపులు గుంపులుగా విడిపోయారు. ఎండవేడి పుంజుకుంది. రావిచెట్టు కింది రంగము రసపట్టుకొచ్చింది. ముందు గుసగుసలు. ఆ తర్వాత వారిలో వారికి వాదోపవాదాలు సాగినై.

నడివయసాకాయన చటుక్కున లేచాడు కత్తెర మసం కట్టుందతనికి తులసి వనంలో కలుపు మొక్కల్లా తెల్లని మీసాలు కనబడుతున్నె. మోకాలువరకున్న ధోవతిని గట్టిగా దులుపుకుంటూ గొంతు సవరించుకున్నాడు.

"అదిగాదె గా నారిగాడు మొగపోరడు నౌకరి జేస్తున్నాడు. కోరవయసు ఉరుకులాడుతుంది. మొగబుద్దో, మొరటుబుద్దో మొత్తె మరి అదెట్ల ఎత్తె?"

అలా ప్రశ్నాబాణం విసిరి ఇలా కూచున్నాడు. అతని గుంపువాళ్ళ మొహాలు వెలిగిపోయినై.

"అవును మల్ల. గా బాలిపోరికి సిగ్గు - శెరము, భయం-భక్తి ఉండొద్దా?"

"ఆ పోరికిష్టం లేకపోతే ఈ పోరడేం జేస్తడు?"

"పోరి దగ్గరికొచ్చి మీద వడ్డదేమో? పోరడు దులుపుకున్నడు. దీంట్ల వాని తప్పు ఏముందటా?"

అదే గుంపులోంచి ఉపప్రశ్నలు దూసుకొస్తున్నాయి. కొందరివేళ్ళు ముక్కులమీద వాలుతున్నె. మరికొందరు ముసిముసిగా నవ్వుకుంటున్నారు.

మరో గుంపులోంచి ఇంకో నడివయసాయన లుంగీ సర్దుకుంటూ లేచి నుంచున్నాడు. "ఐతే ఆడపోరి బతుకు అన్యాయం జేస్తాడా?" ఆవేశం అవహించింది "బాలిపోరి ఎర్రగ బుర్రగుంది. కొంచవంత చదువుకుంది. కాని... దానికా మాయ, మర్మం దెల్వది. దోరవయసులుంది. పెండ్లి కాలేదు. గా కోతి బుద్ధి నారిగాడు ఎంబడవడ్డడు. బోల్‌చుక్క ముచ్చట్లుజెప్పి బోల్తా కొట్టిచ్చిండు. పాపం! అదిగూడా ఉప్పూకారం తింటుంది గదా! ఆడ బుద్ధో అపర బుద్ధో ఎత్తె వాడెట్ల మొత్తె?" ఎడమ అరచేతిలో కుడి పిడికిలి గుద్దేసింది.

ఆ గుంపులో ఉత్సాహం, పట్టుదలలు ఉరకలేసినై.

"నిజమేపాపం! వాడేమన్నా పాలుదాగే బుడ్డపోరడా! అది తప్పని వానికి దెల్వదా?"

"దానిమీద మనసున్నోడు దాన్నే పెండ్లజేసుకుంటనని తల్లిదండ్రులతోని పోరు పెట్టేదుండె. పోరి పుణ్యాని కొచ్చిందని పుణుకులాడ్తడా?"

" వాని కండ్లకు కాపురమొచ్చింది. కండలు బలిసి పోయినై. గా పోరిమీద చెయయ్యేసినందుకు వాని చెయ్యి నరికెయ్యాలె."

"నౌకరి ఉన్నదని నక్రాలు జేస్తుండేమో! దునియాల సర్కారు నౌకరి వానికొక్కనికే ఉందా?".

" ఇప్పుడు మన గూడెంల పందుల గాసుకునేటోడు గూడ మంచిగనే బతుకుతున్నడు. ఇది.. నారిగాని తప్పుగాదని ఎవలంటరు?"

ఉప ప్రశ్నలు ఉప్పెనలా దూసుకొస్తున్నె.

గుంపుల్లో తర్జనబర్జనలు తారస్థాయికి చేరుకున్నె. ఎవరేంమాట్లాడ్తున్నారో పక్కమనిషికి గూడా వినబడ్డంలేదు. చాలాసేపు గడిచిందిలా.

వేడితగ్గిన సూర్యుడు పడమటి కొండలవైపు పరుగులు తీస్తున్నాడు.

జనాల్లోంచి రకరకాల ప్రశ్నలు దూసు కొచ్చి జవాబుల్లేకుండా మాయమై పోతున్నె. కాని ముఖ్యమైన రెండు ప్రశ్నలు మాత్రం అలాగే నిలబడిపోయినై.

"మొగబుద్ధో మొరటుబుద్ధో వాడు మొత్తె. అదెట్ల ఎత్తె?"

"ఆడ బుద్ధో, అపర బుద్ధో ఎత్తె.. వాడెట్లు మొత్తె?"

ఒకగుంపులోంచి ఒక ప్రశ్న దూసుకోస్తే దానికి జవాబుగా మరో గుంపులోంచి ఇంకో ప్రశ్న దూసుకొస్తుంది. అవే ప్రశ్నలు. అవే జవాబులు. మళ్ళీ మళ్ళీ తలెత్తి పెద్దమనుషుల్ని పరేశాన్ చేస్తున్నె

రుమాళ్ళ సవరింపులు, మీసాల మెలివేతలు, తుప్ప తుప్ప ఉమ్మేయడం యధవిధిగా సాగిపోతున్నై.

రావిచెట్టు నీడలు పొడుగై దూరంగా జరిగిపోయినై. సాయంత్రం నీరెండలో పసలేదు. పంచాయితీ డైలాగులు వినివిని వెనకవున్న చెట్టుకొమ్మలు విసిగి పోయినట్టుగా తలలాడించడం మానేశాయి. అందరి నాల్కలు పందిపలాలవు – కల్లుకోసం లొట్టలేస్తున్నై. నోట్లో నీరూరుతోంది.

పొద్దుగూకింది. ఇంగ ఇయ్యాల్లటి దావతు ఖర్చు చెరిసగం" మరో పెద్దమనిషి గుర్తుచేసాడు.

కులస్తుల్లో సంతోషం గంతులేసింది. నేరం చేసి బాధపడుతున్నట్టు మైసయ్య, వెంకటేశులు బిత్తరపోయి మొహాలు చూసుకున్నారు.

ఎప్పట్నుంచో వస్తుందాయె దావతు ఆచారం. ఇప్పుడు కాదంటే తప్పుతుందా?

ఉన్నజాగలుండక మనపోరలు మనల్ని ఆగం జేసిరి...

కళ్ళు మాట్లాడుకుంటన్నై.

"నేనో పందినిస్తా." మైసయ్య ఏడుపుమొహం.

"నేను కల్లు దెప్పిస్తా." వెంకటేశు తలబాదుకున్నాడు.

బలహీన పడిన సూర్యకిణాలు రావి ఆకులకు బంగారు పూతలు పూస్తున్నై.

హమ్మయ్య! ఇంగ ఇంటికి పొయ్యి దావతుకు తయారై రావాలె... లేద్దామనుకుంటున్నారంతా.

డ్యూయట్ పాడుకుంటున్న సినిమా హీరో – హీరోయిన్లలా బాలవ్వ నారాయణలు చేతిలో చేయ్యేసుకుని జంటగా వస్తున్నారు. మెడలో పూలదండలు, ఒంటి నిండా బట్టలున్నాయి. పక్కన ఇద్దరు పోలీసులు, వెనక ఎవరో నలుగురు. అటువైపే వస్తున్నారు.

అడవి ప్రయాణంలో కొరివి దయ్యాలెదురైనట్టు – కులస్తులు, కులపెద్ద, పెద్దమనుషుల నరాల్లో కాస్సేపు రక్తప్రసరణ ఆగిపోయింది. బొమ్మల్లా నుంచుండి పోయారు. అసలేం జరగబోతుందనేది ఎవ్వరికీ అర్థంకాలేదు.

"కూచోండ్రి. మీరెవ్వలూ లేవొద్దు!" హెడ్‌కానిస్టేబులు లాఠీ స్టైల్‌గా గాల్లోకి లేచింది. అందరికంటే ముందు పరుగెత్తుకొచ్చి, "కూచోండ్రి. మీరు మీ గద్దెమీదనే కూచోండ్రి." పెద్దమనుషులకు గద్దె చూపించాడు.

లేచి నుంచున్న వారంతా వరుసగా కూచుంటున్నారు. గద్దెమీద కూచోవాలంటే – పెద్దమనుషుల వెన్నులోంచి వణుకులాంటిది పుట్టుకొస్తుంది.

పబ్లిక్ మీటింగ్‌లో బందోబస్తు డ్యూటీ చేస్తున్నట్లు కానిస్టేబుల్ కులస్తుల చుట్టూ తిరుగుతూ, సైగలు చేస్తూ, లాఠీతో కూచోబెడ్తున్నాడు. ఆ పని పూర్తయ్యాక వేదికవద్ద కొచ్చి హెడ్ పక్కన నుంచున్నాడు. హెడ్ కానిస్టేబుల్ సైగ అందింది, చెప్పుమని. కానిస్టేబులందుకున్నాడు.

"గీ బాలవ్వ - నారాయణలు ప్రేమించుకున్నరటా!" లాఠీ చేతుల్లో నాల్యమాడుతోంది. "వీళ్ళిద్దరూ మేజర్లే. అంటే ఆమెకు పద్దునిమిదేళ్ళ వయసు, అతనికి ఇరవమొక్కేళ్ళ వయసు దాటింది. వాళ్ళ పెండ్లి వాళ్ళ ఇష్టం. మీరు వాళ్ళ పెండ్లికొప్పుకోరటకట్నాలనీ పుట్నాలనీ.

సతాయిస్తారనీ సీదా మా స్టేషన్కొచ్చింండ్రు. మా యస్సైసాబుకంతా చెప్పింండ్రు మా యస్సైసాబు కొత్తబట్టలు, పూలదండలు తెప్పించిండు. బ్రహ్మణు దొచ్చిండు. శాస్త్రప్రకారం పెండ్లి జరిగింది. మా పోలీసు స్టేషన్ పెండ్లి పందిరైంది. మేమంతా అక్షంతలు చల్లినం." బాలవ్వ - నారాయణల వెనక ఉన్నవారిని లాఠీతో చూపిస్తూ "ఇగో - గీ నలుగురు నారాయణ ఆఫీసోళ్ళు. ఈ పెండ్లికి వీళ్ళు సాక్షెం. ఇంగ మీరెవ్వలేమన్నా నడువది. గడ్బడ్ జేస్తే కుదరది." అంటూ హెడ్ కానిస్టేబుల్ వైపు చూశాడు. - బాగానే చెప్పానుగదా అన్నట్టుగా.

"ఇంగ వీళ్ళు ఆలుమొగలు. మా పోలీసోల్లంటె ఎవరనుకున్నరు?' హెడ్కానిస్టేబుల్ మొహం వెలిగిపోతోంది. "మేము మీమ్మల్ని రచ్చించేటోల్లం." కులపెద్దను పక్కకు జరిపి గద్దెమీద తానూ కూచున్నాడు. "ఎవలన్నా వీళ్ళను ఏమన్నా అంటే బాగుండుదు. వీళ్ళను మాటాలద్వారాగానీ, చేతల ద్వారా గానీ ఎవరేమి ఇబ్బంది పెట్టినా వెంటనే పట్టుకుపోతం. పోలీసు స్టేషన్ల పడేసి పక్కబొక్కలిరగ్గొడ్తం. జెర వీళ్ళను మంచిగ జూసుకోండ్రి ఏమంటవయ్యా పెద్దాయిన?" కనుబొమలెగిరిపడినై.

కులపెద్దకు ఒళ్ళంత చెమటమయమైంది. నుదుటిమీది ముచ్చెమటలను రూమాలతో అద్దుకున్నాడు. పక్కనున్న పెద్దమనుషులవైపు చూసా్తా గొంతు సవరించుకున్నాడు.

"పోలీసోల్లంటే గవుర్మెంటోలు గద! మేము కాదంటమా? మీ లెక్క మేము గూడ దీవిస్తము సార్!" సవినయంగా మనవిచేసుకున్నాడు.

"ఔ! గట్లనే జేస్తము" పుద్దమనుషుల తలలూగినై.

బాలవ్వ బుగ్గలనావరించిన సిగ్గులను నారాయణ ఓరచూసులు ఏరుకుంటున్నే.

"నీ యవ్వ! బేకారైంది గదె!"

"బంగారి మసొంటి దావతు... ప్చ్... బాకిలేదు"

"గీ పోరగాండ్లు.... గిట్ల జేస్తరనుకోలేదు."

కులస్తుల వ్యాఖ్యానాలు వారికే పరిమితమై పోయినై.....

**అమెరికా భారతి, జనవరి - ఫిబ్రవరి 2003**

★★★★